సాక్షి సూర్యాపేట

మంగళవారం, 26, మార్చి, 2024



భాగవతమే ప్రాణప్రదం

తుర్కపల్లికి చెందిన భాగవత కళకారులు యక్షగాన ప్రదర్శనలిస్తూ ప్రాచీన కళారూపాలను కాపాడుతున్నారు. - 8లో



'సేంద్రియం'పై దృష్టి సారించాలి

సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని మదన్‌గుప్తా సూచించారు. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-34 (మంగళవారం సా॥)

సహర్ 4-53 (బుధవారం ఉ॥)

న్యూస్‌రీల్

త్వరలో కేసీఆర్ పర్యటన

నల్లగొండ టూటౌన్ : ఎండిన పంట పొలాలను పరిశీలించేందుకు త్వరలో నల్లగొండ మండలంలోని ముషంపల్లి, ఆలేరు నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఎండిన పంట పొలాల నివేదికను కేసీఆర్‌కు అందజేశారు. ఈ మేరకు జిల్లాలో పర్యటించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని తనను కలిసిన కంచర్ల బ్రదర్స్‌కు కేసీఆర్ సూచించినట్లు తెలిసింది.

పంచాంగం ఆవిష్కరణ



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ ప్రమీల, శంకరామూర్తి తదితరులు

కోదాదరూరల్ : శ్రీక్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరూ పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల రమేష్, వైదిక బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మంత్రమూర్తి శంకర మూర్తిలు అన్నారు. సోమవారం పట్టణంలోని పెరిక కల్యాణ మండపంలో వైదిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన పంచాగాన్ని పట్టణ ప్రముఖులు, పురోహితులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన పురోహితులకు పంచాంగాన్ని అందజేశారు. కార్యక్రమంలో ముత్తవరపు పాండురంగారావు, సైడిమర్రి సత్యబాబు, బొలిశెట్టి కృష్ణయ్య, ఎస్ఆర్‌కె మూర్తి, అచ్యుతరామశర్మ, విష్ణుబొట్ల హరిప్రసాద్‌శర్మ, మహంకాళి రామ ప్రశాస్త్రీ, ఇరువంటి వెంకటరమణ, ఫణి, రాజశేఖర్, సాయి, హనుమాత్ శాస్త్రీ ఉన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నిత్యారాధనలు కొనసాగాయి. దీంట్లో భాగంగా శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా ముస్తాబు చేసి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అదే విధంగా క్షేత్రంలోని శివాలయంలో గల శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లిలక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు పాల్గొన్నారు.

సాగర్‌ను సందర్శించిన వియత్నాం ప్రతినిధులు



ఆచార్యనాగార్జునుని విగ్రహం వద్ద వియత్నాం మీడియా ప్రతినిధులు

నాగార్జునసాగర్ : అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను సోమవారం వియత్నాం దేశ మీడియా ప్రతినిధులు సోమవారం సందర్శించారు. తెలంగాణ ప్రభుత్వం మర్రిచెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మార్చి 18నుంచి 30వ తేదీ వరకు 'జర్నలిజం–పబ్లిక్ రిలేషన్స్' అనే అంశంపై వియత్నాం మీడియా ప్రతినిధులకు శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం, నాగార్జున కొండ, మ్యూజియం, సాగర్‌డ్యాం తదితర ప్రాంతాలను ప్రతినిధులు సందర్శించారు. వీరికి మిర్యాలగూడ ఆర్డీఓ శ్రీనివాసరావు, పెద్దవూర ఆర్ఐ శ్రీనివాసరెడ్డి స్వాగతం పలికారు. బుద్ధవనంలోని జాతక కథలపార్కు, బుద్ధవనం డ్యాకుమెంటరీని స్క్రీన్‌పై చూపించారు. వీరి వెంట నోడల్ అధికారులు వడ్ల శ్రీనివాస్, డాక్టర్ కుందోజు సురేష్‌కుమార్, శరత్, గైడ్ సత్యనారాయణ, బుద్ధవనం సూపర్‌వైజర్ విష్ణు తదితరులు ఉన్నారు.

హోలీ.. రంగుల కేళి



చివ్వెంల మండలం కుడకుడలోని బాలుర హాస్టల్‌లో విద్యార్థికి రంగులు పూస్తున్న కలెక్టర్ వెంకటరావు



సూర్యాపేటలోని విద్యానగర్‌లో హోలీ ఆడుతున్న మహిళలు



60ఫీట్ల రోడ్ సమీపంలో నృత్యం చేస్తున్న చిన్నారులు



రంగులు పూసుకుంటున్న మహిళలు

నీరుగారిన 'ఉపాధి' లక్ష్యం

ఉపాధి కూలీలకు 100 రోజుల పని కల్పించడంలో విఫలం

- 64.89 లక్షల పనిదినాలకు 55 లక్షల పనిదినాలు పూర్తి
- కేవలం 1,682 కుటుంబాలకే వంద రోజుల పని
- జాబ్ కార్డులను సద్వినియోగం చేసుకోలేక పోతున్న కూలీలు



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లాలో మందకొడిగా సాగుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 64.89 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 55లక్షల పనిదినాలు కల్పించి రాష్ట్రంలోనే 13వ స్థానంలో కొనసాగుతున్నారు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం పూర్తి కానుండటంతో మిగిలిన 5 రోజుల్లో 9.89లక్షల పనిదినాలు పూర్తి చేయడం గగనమే. ఈ ఏడాది ఇప్పటి వరకు 1,83,547 కుటుంబాలకు అధికార యంత్రాంగం పని కల్పించింది.

55 లక్షల పనిదినాలు పూర్తి

సూర్యాపేట జిల్లాలో ఉపాధి హామీ పనులు లక్ష్యం చేరేలా లేదు. జిల్లా పరిధిలో 475 గ్రామ పంచాయతీల వారీగా పనులు గుర్తించిన యంత్రాంగం 64.89 లక్షల పని దినాలు కూలీలకు కల్పించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టారు. జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించారు. కానీ ఇప్పటి వరకు 55లక్షల పని దినాలు పూర్తి చేసి 84.75శాతం లక్ష్యం చేరుకున్నారు.

3.46లక్షల మంది కూలీలకు పని

జిల్లాలోని 23మండలాల పరిధిలో జాబ్‌కార్డు కలిగిన కుటుంబాలు 2,61,192 ఉండగా 5,69,350 మంది కూలీలు ఉన్నారు. 2023–24 సీజన్‌లో 1,83,547 కుటుంబాల్లో 3,46,086 మంది కూలీలకు పని కల్పించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 159.17 కోట్ల రూపాయలు ఉపాధి హామీలో ఖర్చు చేయగా 96.45 కోట్ల రూపాయలు కూలీలకు వేతనంగా చెల్లించారు.

ప్రస్తుతం 34,881 మందికి పని

జిల్లాలో ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య ఈ నెలలో రికార్డు స్థాయిలో పెరిగింది. గత నెలతో పోలిస్తే ఈ నెలలో సుమారు 15 వేలకుపైగా కూలీలు పెరిగారు. జిల్లాలో 475 గ్రామపంచాయతీల్లో ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. ఆయా మండలాల్లో ఉపాధి హామీ పనులకు హాజరైన కూలీలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 34,881 మంది కూలీలు హాజరు అవుతున్నారు. ప్రస్తుతం కూలీల హాజరు ప్రకారం రాష్ట్రంలో జిల్లా 7వ స్థానంలో ఉన్నది.

1682 కుటుంబాలకే వంద రోజుల కల్పన..

జిల్లా వ్యాప్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు కేవలం 1,682 కుటుంబాలకు వంద రోజుల పని కల్పించారు. రెండేళ్ల క్రితం వరకు జిల్లాలో ఏటా 20 వేలకుపైగా కుటుంబాలకు వంద రోజులపాటు పనులను కల్పించగా, గత రెండేండ్లుగా కూలీల సంఖ్య ఐదు వేలకూ పెరుగకపోవడం గమనార్హం.

రైతుకు క'న్నీటి' కష్టం!



జాజిరెడ్డిగూడెం మండలంలో ఎండిపోతున్న వరిపొలాలు

- ఎండుతున్న ఎస్సారెస్పీ రెండో దశ ఆయకట్టు
- 23నుంచి రావాల్సిన ఆరో విడత నీళ్ల ఊసేలేదు
- చివరి విడత నీటి కోసం తప్పని నిరీక్షణ
- శ్రీరామా దయచూపవా అని వేడుకుంటున్న రైతులు

అర్వపల్లి: శ్రీరాం సాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) రెండో దశ ఆయకట్టు రైతులకు కన్నీటి కష్టాలు వచ్చాయి. ప్రస్తుత యాసంగి సీజన్‌లో చేతికొచ్చిన వరిపొలాలు గోదావరి జలాలు అందక నిలువునా ఎండిపోతుండడంతో కర్షకులు దిక్కుతోచనిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. శ్రీరామా కరుణించవా అంటూ.. రైతులు గోదావరి జలాల కోసం ఎదురు చూస్తున్నారు. పొట్టదశలో ఉన్న పంటపొలాలు నీళ్లరాకపోవడంతో మాడిపోతున్నాయని, తమ బాధను ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆయకట్టులో 1.50లక్షల ఎకరాల్లో సాగు

జిల్లా వ్యాప్తంగా ఎస్సారెస్పీ రెండో దశ కింద ఈ యాసంగి సీజన్‌లో సుమారు 1.50 లక్షల ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. అయితే, నీటి పారుదల శాఖ అధికారులు ఈ సీజన్‌లో జనవరి 8నుంచి ఈ నెల 30వరకు ఆరు విడతల్లో (ఆరు తడులుగా) జిల్లాకు సాగునీటిని విడుదల చేస్తామని ముందస్తుగా షెడ్యూల్ విడుదల చేశారు. ఈ షెడ్యూల్ ప్రకారం నీరు విడుదల చేస్తున్నప్పటికీ గతంలో కన్నా నీటిని తగ్గించడం, తక్కువ రోజులు వదిలారు. వారబందీ విధానంలో నీటిని విడుదల చేస్తామని ప్రకటించినా కొన్ని వారాలు వారం పాటు ఇవ్వకుండా నాలుగైదు రోజులు మాత్రమే నీటిని వదిలారు. దీంతో ఆయకట్టులో సాగు చేసిన వరిపొలాలు ఎండిపోతున్నాయని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.

చివరి విడత కూడా ఇవ్వకుండా..

నీటిపారుదల శాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం వారబందీ విధానంలో ఆరో విడతగా (ఆరో తడి) ఈనెల 23 నుంచి 30 వరకు నీళ్లు వదలాల్సి ఉంది. అయితే నాలుగు రోజులు కావస్తున్నా ఇంతవరకు నీటిని వదలలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఎస్సారెస్పీ రెండో దశ కింద సాగవుతున్న వరి పొలాలు ఎక్కడికక్కడ నీరు లేక బీటలు వారుతున్నాయి. ఇప్పటికే నీళ్లు అనుకున్న ప్రకారం రాక చివరి భూములకు నీళ్లు అందకపోవడంతో సుమారు 15వేల ఎకరాలకుపైగా వరిపంట ఎండిపోయి పశువులకు మేతగా మారాయి. ఈ చివరి విడత నీళ్లు రాకపోతే సగానికి పైగానే వరిపంట పూర్తిగా ఎండిపోతుందని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ వారం పాటు నీళ్లిస్తే వరిపంట చేతికొస్తుందని, తిండిగింజలైన దక్కుతాయని రైతులు అంటున్నారు.

గోదావరి జలాలపైనే ఆధారపడి..



"గోదావరి జలాలపైనే ఆధారపడి 5 ఎకరాల వరిపంట సాగుచేశా. కొన్నేళ్లుగా ఈ నీటితోనే వరిపంట పండిస్తున్నా. ఎస్సారెస్పీ 71 డీబీఎం కాలువ వెంట పొలం ఉన్నా ఈసారి సరిగా నీళ్లురాక వరిపంట ఎండిపోతుంది. షెడ్యూల్ ప్రకారం ఆరో తడి నీళ్లు ఇంత వరకు రాలేదు. ఈ చివరి విడత నీటిని వదిలి వరి పంటలను కాపాడాలి.

– కదారి నరేష్, రైతు అర్వపల్లి

ఒకటి రెండు రోజుల్లో నీళ్లు వస్తాయి



"ప్రాజెక్టులో నీటి లభ్యత తక్కువగా ఉండడంతో ఈసారి నీళ్లు తక్కువగా వదులుతున్నారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చివరి తడి నీటి విడుదల ఒకటి రెండు రోజుల్లో జరుగుతుంది. ఈ నీటి కోసం ఉన్నతాధికారులను ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ రేయింబవళ్లు తీవ్ర ప్రయత్నం చేస్తున్నాం.

– ఎం.సత్యనారాయణ, బయ్యన్నవాగు డీఈఈ

మోదీ పాలనకు చరమగీతం పాడాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి: దేశంలో ప్రధాని మోదీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మఠంపల్లి మండలం మట్టపల్లి క్షేత్రంలో ఈనెల 30న పార్లమెంట్ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించేందుకు సోమవారం ఆయన వచ్చారు. మట్టపల్లిలోని పలు అన్నదాన సత్రాలు, టీటీడీ కల్యాణ మండపాన్ని పరిశీలించారు. స్థానిక ఆర్యవైశ్య సత్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మోదీ నిరంకుశపాలన దేశంలో రైతులను నట్టేట ముంచిందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ చేపట్టిన ఉద్యమంలో సుమారు 730మంది రైతులు చనిపోయారన్నారు. దేశ చరిత్రలోనే మోదీ పాలనలో పార్లమెంట్ వ్యవస్థ ధ్వంసం అయ్యిందన్నారు. చివరికి పార్లమెట్ సమావేశంలో ఏకంగా 146 మంది ఎంపీలను సస్పెండ్ చేసిన చరిత్ర మోదీదే అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా ఇచ్చిన హామీల్లో ఖాజీపేట రైల్వేస్టేషన్ , బయ్యారం స్టీల్ ప్లాంట్, గిరిజన యూనివర్సిటీల ఏర్పాటును తుంగలో తొక్కారన్నారు. దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశా రు. తెలంగాణలో 13ఎంపీ స్థానాలను గెలువబోతున్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల తర్వాత తెలంగాణలో కనుమరుగు కావడం ఖాయమన్నారు.

30న సన్నాహక సమావేశం

మట్టపల్లిలో ఈనెల 28న జరగాల్సిన కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశాన్ని ఈనెల 30న నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, శివారెడ్డి, నాగన్నగౌడ్, చావాకిరణ్మయి, ఎంపీపీలు గోపాల్, శ్రీనివాస్, మంజీనాయక్, కిషోర్‌రెడ్డి , నిజాముద్దీన్,సంపత్ రెడ్డి, హరిబాబు పాల్గొన్నారు.

పెట్రోలియం డీలర్ల మౌన ప్రదర్శన

కోదాడ: గడిచిన ఏడేళ్లుగా తమకు కమిషన్ పెంచకపోవడం వల్ల బంక్‌ల నిర్వాహణ కష్టంగా ఉందని, యజమానులు అప్పులపాలు అవుతున్నారని, కంపెనీలు వెంటనే డీలర్లకు కమీషన్ పెంచాలని కోరుతూ జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కోదాడలో మౌన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి రమేష్ మాట్లాడుతూ వాహనదారులకు తాము అన్నిరకాల సేవలు అందిస్తున్నామని తెలిపారు. కంపెనీలు కమీషన్ పెంచాలని కోరారు. కార్యక్రమంలో గరిణె శ్రీధర్, వంగవేటి లోకేష్, గన్నవరపు నాగరాజు, శేషు, చంద్రయ్య పాల్గొన్నారు.



మౌన ప్రదర్శన చేస్తున్న డీలర్లు

మూడోసారైనా ముడిపడేనా?

- కోదాడ పెద్ద చెరువు కట్ట మినీట్యాంక్‌బండ్ పనులకు మూడోసారి శంకుస్థాపన
- కోట్లు ఖర్చు చేస్తున్నా సాగని పనులు
- రివిట్‌మెంట్ ధ్వంసమై కోతకు గురవుతున్న చెరువు కట్ట
- దశాబ్ద కాలంగా నెరవేరని పట్టణ వాసుల కల



ధ్వంసమైన కోదాడ పెద్దచెరువుకట్ట రివిట్‌మెంట్

కోదాడ: కోదాడ పెద్దచెరువు కట్టను మినీట్యాంక్ బండ్‌గా మారుస్తామని దశాబ్దకాలంగా పాలకులు చెపుతున్న మాటలు నీటిమీద రాతలే అవుతున్నాయి.శంకుస్థాపనలు చేయడం పనులు చేపట్టకపోవడం షరా మామూలుగా మారిపోయిందని కోదాడ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడోసారి శంకుస్థాపన చేసినా పనులు ఇంకా మొదలు కాలేదు. ఇలా మూడుసార్లు శంఖుస్థాపనలు జరుపుకున్నా పట్టణ వాసుల మినీట్యాంక్‌బండ్ కల మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది.

నిండా నిర్లక్ష్యం...

కోదాడ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌గా ఉన్న సమయంలో 720 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. ఆక్రమణలతో ప్రస్తుతం 400 ఎకరాలకే పరిమితమైంది. టీఆర్ఎస్ ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చిన సమయంలో మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రూ.5 కోట్లతో పెద్దచెరువు పూడిక తీయడం, కట్టను పటిష్ట పరిచి మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చడం, చెరువు ఉత్తరం పక్కన మినీపార్క్‌ను ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి పనులు చేపట్టారు. మూడేళ్ల పాటు పనులు చేసినా అవి పూర్తి కాలేదు. బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయాడు. ఆ తరువాత మున్సిపాలిటీ అధికారులు అరకొరగా అభివృద్ధి చేసిన చెరువు కట్టపై లక్షల రూపాయల వ్యయంతో విద్యుత్ దీపాలను, బల్లలు ఏర్పాటు చేసినా అది మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. ఆ తరువాత పట్టించుకొనే నాథుడు లేక ప్రస్తుతం చెరువు కట్ట కంపచెట్లతో నిండిపోయి అడవిని తలపిస్తు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.

ధ్వంసమైన రివిట్‌మెంట్

పెద్దచెరువు కట్టను మినీట్యాంక్‌బండ్‌గా మారుస్తామని గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కట్ట లోపల కోతకు గురికాకుండా ఏర్పాటు చేసిన రివిట్ మెంట్‌ను ప్రోక్లెయిన్‌తో పెకిలించాడు. మళ్లీ దాన్ని పునర్మించకుండా వదిలేయడంతో అది మెత్తం చెరువులోకి జారి పోయింది. చెరువు కట్టకోతకు గురవ్వై ప్రమాదకరంగా మారింది. ఇప్పటి వరకు చెరువులో నీరు ఉండడంతో దీన్ని ఎవరు గమనించలేదు. తాజాగా చెరువులో నీరు తగ్గడంతో అధికారుల,కాంట్రాక్టర్ నిర్వాహకం బయటపడింది. వచ్చే వానకాలం లోపు ఈ పనులు చేపట్టి రివిట్‌మెంట్‌ను యుద్ధప్రాతిపదికన మళ్లీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని రైతులు అంటున్నారు.

ఒకే పని.. మూడుసార్లు శంకుస్థాపనలు

కోదాడ పెద్ద చెరువు ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయడానికి అధికారులు, పాలకులు మూడు సార్లు శంకుస్థాపనలు చేశారు. మొదటిసారి రూ.5 కోట్లతో చేపట్టిన పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేసి వెళ్లాడు. ఆ తరువాత గత సంవత్సరం ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అప్పటి మంత్రి, ఎమ్మెల్యేలు హడావుడిగా 06-10-23న రూ. 8 కోట్ల టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో పనులను చేపట్టడానికి శంకుస్థాపన చేశారు. కానీ పనులు మొదలు పెట్టలేదు. ఈ పనుల విషయంలో అప్పటి మున్సిపల్ చైర్‌పర్సన్‌కు ఎమ్మెల్యేకు మధ్య వచ్చిన అభిప్రాయ భేదాలతో ఇవి అటకెక్కాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అవే రూ.8 కోట్ల నిధులతో చేపట్టనున్న ట్యాంక్‌బండ్ అభివృద్ధి పనులకు 23-02-24న ప్రస్తుత ఎమ్మెల్యే మరోసారి శంఖుస్థాపన చేశారు. ముచ్చటగా మూడోసారైనా ఈ పనులు ముడిపడతాయో లేదో చూడాలి.





ప్రతిపాదనలతోనే సరి

కోదాడ పెద్దచెరువు ఉత్తరభాగాన దాదాపు 10ఎకరాల స్థలంలో పార్కును ఏర్పాటు చేయాలని పదేళ్లుగా అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నా పనులు మాత్రం అంగుళం కదలడం లేదు. చెరువు ఉత్తర భాగాన కొంత మేర పూడిక మట్టితో పూడ్చి వదిలేశారు. అక్కడ పార్కు ఏర్పాటు చేయడంతో పాటు అక్కడి నుంచి చెరువు కట్టమీదుగా పట్టణంలోకి వచ్చే విధంగా వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పిన అధికారులు మర్చిపోయారు. 80 వేల జనాభా ఉన్న కోదాడ పట్టణంలో ప్రజలు సేద తీరడానికి ఒక్క పార్కు కూడా లేదు.



చెరువు ఉత్తరభాగాన పార్కు ఏర్పాటు చేయాల్సిన ప్రదేశం

గత పాలకుల నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి



"కోదాడ పెద్దచెరువు ట్యాంక్ బండ్ పనులను గత ప్రభుత్వం పదేళ్ల పాటు నిర్లక్ష్యం చేసింది. మేము అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే పనులు చేపట్టడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. రూ. 8 కోట్లతో పనులు చేపట్టి పట్టణ ప్రజల కోరిక తీరుస్తాము. చెరువు ఆక్రమణకు గురికాకుండా అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటాము.

–నలమాద పద్మావతి, కోదాడ ఎమ్మెల్యే

క్లుప్తంగా

గడ్డివాము దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మోత్కూరు: గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ తాగి నిర్లక్ష్యంగా పడేయడంతో గడ్డివాము దగ్ధమైంది. వివరాలు.. మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన పన్నాల శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేయడంతో గడ్డివాముకు నిప్పంటుకుంది. సకాలంలో మోత్కూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. గడ్డివాము పక్కనే ఉన్న కోళ్లఫాంతో పాటు కోతకు వచ్చిన వరి చేనుకు మంటలు అంటుకొని నష్ట తీవ్రత ఎక్కువగా ఉండేదని స్థానికులు అంటున్నారు.

చెరువులో పడి యువకుడు మృతి



మహేష్ (ఫైల్)

గుండాల: చెరువులో పడి వ్యక్తి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన గుండాల మండలంలోని మాసాన్‌పల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన పసునూరి మహేష్(30)కు చిన్నప్పటి నుంచి మూర్ఛ(ఫిట్స్) రోగం ఉంది. సోమవారం కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ పరిధిలోని చెరువు వద్దకు వెళ్లిన మహేష్‌కు మూర్ఛ రావడంతో నీటిలోనే పడిపోయాడు. ఇది గమనించిన మహేష్ తండ్రి చెరువులోకి వెళ్లి చూడగా అప్పటికే మహేష్ మృతిచెందాడు.

శతాధిక వృద్ధురాలు మృతి



మల్లమ్మ (ఫైల్)

చౌటుప్పల్: ప్రతి ఏడాది హోలీ పండుగ రోజు పుట్టినరోజు జరుపుకునే శతాధిక వృద్ధురాలు హోలీ పండుగ రోజే మృతిచెందింది. ఈ ఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో సోమవారం జరిగింది. వివరాలు.. లక్కారం గ్రామానికి చెందిన పాలెం మల్లమ్మ(100)కు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. ఆమెకు ప్రతి ఏడాది హోలీ పండుగ రోజున కుటుంబ సభ్యులు జన్మదిన వేడుకలు నిర్వహిస్తుంటారు. కాగా ఐదు రోజుల క్రితం అనారోగ్యానికి గురైన ఆమెను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. ఈ క్రమంలోనే సోమవారం తెల్లవారుజామున ఆమె మృతిచెందింది. ఈసారి కూడా హోలీ పండుగ రోజు మల్లమ్మ జన్మదిన వేడుకలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తుండగానే ఆమె మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బంగారం, వెండి స్వాధీనం

సూర్యాపేట రూరల్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జనగాం క్రాస్ రోడ్డులో రూరల్ ఎస్‌ఐ బాలునాయక్ ఆధ్వర్యంలో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో విజయవాడ వెళ్తున్న షేక్ నాగుల్ మీరా కారులో ఐదున్నర తులాల బంగారం, ఐదు కేజీల వెండి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న బంగారం, వెండిని ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. వాటి విలువ రూ.7లక్షల84వేలు ఉంటుందని తెలిపారు.

దేవాలయాలే టార్గెట్

- హుండీలు, గంటలు చోరీ చేస్తున్న దుండగులు

చండూరు: గట్టుప్పల్ మండల పరిధిలో దేవాలయాలే టార్గెట్‌గా గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడుతున్నారు. గత రెండు, మూడు నెలలుగా గ్రామాలకు దూరంగా ఉన్న దేవాలయాలను ఎంచుకొని హుండీలు, గంటలు ఎత్తుకెళ్తున్నారు. చండూరు మండలం ఉడతలపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి దేవాలయం తలుపులు పగులగొట్టి వెండి శఠగోపం, మూడు జతల పుస్తె, మెట్టెలను దుండగులు దొంగిలించారు. గత వారం తేరట్‌పల్లిలోని పెద్దమ్మగుట్ట దేవాలయంలో హుండీ పగులగొట్టి నగదు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారు. అదేవిధంగా తేరట్‌పల్లిలోని బీరప్ప దేవాలయంలో గంటలు, ఇతర సామగ్రి, ఇదే గ్రామంలో రెండు నెలల క్రితం ముత్యాలమ్మ దేవాలయంలో మంగళ సూత్రాలు, హుండీ పగులగొట్టి నగదు చోరీ చేశారు. గట్టుప్పల్‌లోని కాటమయ్య దేవాలయంలో, గట్టుప్పల్ మండలంలోని పిల్లిగుండ్ల రామాలయంలో గంటలు చోరీ చేశారు.

పోలీస్ సిబ్బంది కొరత..

గట్టుప్పల్‌ను రెండు సంవత్సరాల క్రితం మండలంగా ప్రకటించడంతో స్థానికంగ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ పోలీస్ స్టేషన్‌లో ప్రస్తుతం ఒక ఎస్‌ఐ మాత్రమే ఉన్నారు. సర్కిల్ పరిధిలోని ఇద్దరు సిబ్బందిని వంతుల వారీగా ఇక్కడికి పంపిస్తున్నారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ చేసేందుకు పోలీస్ సిబ్బంది లేకపోవడంతో దొంగలు విచ్చలవిడిగా దొంగతనాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చండూరు, గట్టుప్పల్ మండలాల్లో సాయంత్రం ఏడు గంటలు దాటిన తర్వాత ఏ రోడ్డున చూసినా మందుబాబులు గుంపులు గుంపులుగా చేరి మద్యం సేవిస్తూ కనిపిస్తున్నారని, అయినప్పటికీ పోలీసులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

విచారణ చేస్తున్నాం..



దేవాలయాల్లో జరుగుతున్న దొంగతనాలపై విచారణ చేస్తున్నాం. మందుబాబులే చోరీలకు పాల్పడుతున్నారనే అనుమానం ఉంది. పోలీస్ స్టేషన్ లో సిబ్బంది కొరతతో పెట్రోలింగ్ చేసేందుకు ఇబ్బందిగా ఉంది. మండలంలో జులాయిగా తిరిగే వారిపై నిఘా ఉంచాం.

– గుత్తా వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐ, గట్టుప్పల్

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి



రైతులకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్న మదన్‌గుప్తా

గరిడేపల్లి: రైతులు, యువత సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని తెలంగాణ గో సేవా విభాగం సభ్యుడు పి. మదన్‌గుప్తా అన్నారు. గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో సేంద్రియ వ్యవసాయంపై నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. సమగ్ర వ్యవసాయ విధానాలు, రైతుల ఆదాయం రెట్టింపు చేసే పంటలను ఎంచుకోవాలని సూచించారు. రసాయన ఎరువులు వాడటం ద్వారా భూమి కలుషితమవుతుందని, సేంద్రియ వ్యవసాయం ద్వారా భూమితో పాటు మానవ ఆరోగ్యం కూడా కాపాడుకోవచ్చని తెలిపారు. సేంద్రియ వ్యవసాయంలో వాడే వివిధ రకాల ద్రావణాలు, కషాయాల తయారీ విధానాలను కూడా వివరించారు. ఆవు పేడ, మూత్రం ద్వారా సబ్బులు, షాంపులు, అగర్‌బత్తుల తయారు చేసి ఉపాధి పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో కేవీకే మృత్తికా శాస్త్రవేత్త కిరణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



చింతకాయల వెంకన్న (ఫైల్)

హుజూర్‌నగర్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన హుజూర్‌నగర్‌లో సోమవారం జరిగింది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన రిక్షా కార్మికుడు చింతకాయల వెంకన్న (55) సోమవారం మధ్యాహ్నం ఇందిరా చౌరస్తా నుంచి సుందరయ్యనగర్ కాలనీకి నడుచుకుంటు వెళ్తున్నాడు. మార్గమధ్యలో పీఎస్‌ఆర్ సెంటర్ వద్దకు రాగానే వెనుక నుంచి వస్తున్న క్రేన్‌ను డ్రైవర్ చేకూరి రాజేష్ అతివేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడుపుకుంటూ వచ్చి వెంకన్నను ఢీకొట్టాడు. దీంతో వెంకన్న కిందపడిపోగా కడుపులో బలమైన గాయాలయ్యాయి. వెంటనే అతడిని స్థానిక ప్రాంతీయ వైద్యశాలలో తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడ నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా.. అప్పటికే అతడు మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి బావమరిది ములకలపల్లి రాంగోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యవసాయ భూమిలో మగ శిశువు లభ్యం

- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి



మగ శిశువు

చండూరు: మండల పరిధిలోని బంగారిగడ్డ గ్రామ శివారులో సోమవారం మగ శిశువు లభ్యమైంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగారిగడ్డ గ్రామ శివారులోని సుంకరి యాదయ్య వ్యవసాయ భూమిలో అప్పుడే పుట్టిన మగ శిశువును గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు. యాదయ్య శిశువును గమనించి గ్రామస్తులు పోలీసులు, సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని 108 వాహనంలో శిశువును నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కాగా ఇటీవల గ్రామంలో మతిస్థిమితం లేని ఓ మహిళ గర్భంతో తిరిగిందని.. ఆమె ప్రసవించి శిశువును ఇక్కడ పడేసి వెళ్లి ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ముగ్గురు మహిళలను విచారించి వదిలేశారు. గ్రామ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉప్పు సురేష్ తెలిపారు.

ఘనంగా చెన్నకేశవస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

సూర్యాపేట రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రిలో గల చెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రథంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి గ్రామంలో ఊరేగించారు. అనంతరం హోలీ వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో చైర్మన్ రాజబాబురెడ్డి, కౌన్సిలర్ బచ్చలకూరి శ్రీనివాస్, వంశపారంపర్య ధర్మకర్త ఉమ్మెంతల ఆహ్లాదరావు, ఉమ్మెంతల హరిప్రసాదరావు, అర్చకులు మరింగంటి వరదాచార్యులు, ముడుంబై రఘువరన్ ఆచార్యులు, దరూరి రాఘవాచార్యులు, గోమఠం రాఘవాచార్యులు, డైరెక్టర్లు చెరుకుపల్లి కృష్ణయ్య, మంగపండ్ల మల్లికార్జున్, కుమ్మరికుంట్ల జానయ్య, చెరుకుపల్లి సైదమ్మ, గంపల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు.. మద్యం పట్టివేత



కేతేపల్లి : గుడివాడలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధి లోని పైలాన్‌కాలనీ బైపాస్‌లో గల రవి కిరాణం షాపులో 14 బీర్లు, 10క్వార్టర్ బాటిళ్లను నాగార్జునసాగర్ ఎస్‌ఐ సంపత్‌గౌడ్ తన సిబ్బందితో కలిసి వెళ్లి సోమవారం పట్టుకున్నారు. కిరాణ దుకాణ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. కిరాణం, బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు జరిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కేతేపల్లిలో..

కేతేపల్లి: మండలంలోని గుడివాడ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యంను సోమవారం కేతేపల్లి పోలీసులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శివతేజ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు గుడివాడ గ్రామంలోని ఓ కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.6,842 విలువైన 17.27 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామని తెలిపారు. కిరాణా దుకాణం నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బెల్ట్ దుకాణాలపై పోలీసుల దాడులు..

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం, చౌటుప్పల్, లక్కారంతో పాటు మండలంలోని తూప్రాన్‌పేట గ్రామంలోని బెల్ట్ దుకాణాలపై సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు ధనుంజయ్య, లక్ష్మయ్య, యాదవరెడ్డి, పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం



దహన సంస్కారాలు నిర్వహిస్తున్న యాకుబి



మృతదేహానికి పూలమాల వేస్తున్న యాకుబి

- అనాథాశ్రమంలో వృద్ధురాలు మృతి
- అంతిమసంస్కారాలకు ముందుకు రాని సోదరుడు
- అంత్యక్రియలు పూర్తిచేసిన ముస్లిం మహిళ

భువనగిరి క్రైం : మానవత్వం పరిమళించింది. అనాథశ్రమంలో కనుమూసిన ఓ వృద్ధురాలికి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు సోదరుడు ముందుకు రాకపోవడంతో ముస్లిం అయిన ఆశ్రమ నిర్వాహకురాలే అన్నీ తానై ఆ తంతు పూర్తి చేసి మానవత్వం చాటుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా కోరుట్ల గ్రామానికి చెందిన కందేసి చంద్రకళ(72) భర్త కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. ఈమెకు పిల్లలు లేకపోవడంతో సోదరుడు గంగా ప్రసాద్ వద్ద ఉంటోంది. అవసాన దశలో సోదరి ఆలనాపాలనా చూడలేక గంగా ప్రసాద్ గత జనవరి 19న చంద్రకళను భువనగిరి మండలం రాయగిరిలోని సహృదయ అనాథాశ్రమంలో చేర్పించి వెళ్లిపోయాడు. అనారోగ్య కారణాలతో చంద్రకళ ఆదివారం మృతిచెందింది. ఆశ్రమ నిర్వాహకురాలు యాకూబి చోటు అదే రోజు ఫోన్ ద్వారా గంగా ప్రసాద్‌కు సమాచారం ఇచ్చినా ఆయన స్పందించలేదు. సోమవారం మరో మారు ఫోన్ చేసినా తాను రానని చెప్పడంతో యాకూబి హైందవ సంప్రదాయం ప్రకారం చంద్రకళ అంత్యక్రియలు పూర్తి చేసి పలువురి అభినందనలు అందుకుంది.

లక్షా యాభై వేల ఎకరాలు కొల్లగొట్టారు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: గడిచిన పదేళ్లలో తెలంగాణ వ్యాప్తంగా లక్షా యాభై వేల ఎకరాల ప్రభుత్వ భూములను గత పాలకులు బినామీల పేర్లతో కొల్లగొట్టారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆరోపించారు. నకిరేకల్‌లో సోమవారం ఆయన హోలీ సంబరాల్లో పాల్గొని మాట్లాడారు. ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములను కొల్లగొట్టారో సర్వే నంబర్లతో సహా పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని, దీనిపై మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి చర్చకు రావాలని సవాల్ విసిరారు. దీనిపై త్వరలో సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి మూడు నెలలు మాత్రమే అయ్యిందని, ఈ మూడు నెలల్లోనే కరువు వచ్చిందని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి మాట్లాడటంలో అర్థం లేదన్నారు. ఏ నియంత అయినా ప్రజల జోలికి వస్తే మట్టి కరవక తప్పదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు స్వేచ్ఛా వాతావరణంలో ఉన్నారని పేర్కొన్నారు. నకిరేకల్ నియోజకవర్గానికి సంబంధించి పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టులు, అయిటిపాముల లిఫ్టును వచ్చే హోలీ పండగ లోపు పూర్తిచేసి నీళ్లు తెప్పిస్తానని హామీ ఇచ్చారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి

రామగిరి(నల్లగొండ): నీటి సంపులో పడి బాలుడు మృతి చెందిన ఘటన సోమవారం తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లిలో జరిగింది. వివరాలు.. అనిశెట్టి దుప్పలపల్లి గ్రామానికి చెందిన కన్నెబోయిన యాదయ్య, రేణుక దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు శివ(7) సంతానం. సోమవారం ఉదయం యాదయ్య, రేణుక ధాన్యం ఆరబోయడానికి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లారు. శివ ఇద్దరు అక్కలు ఆడుకోవడానికి బయటకు వెళ్లారు. మధ్యాహ్నం శివ భోజనం చేసి చేతులు కడుక్కోవడానికి ఇంట్లో ఉన్న నీటి సంపు వద్దకు వెళ్లాడు. బకెట్తో నీరు చేదుతుండగా జారి సంపులో పడ్డాడు. కొద్దిసేపటి తర్వాత శివ అక్కలు ఇంట్లోకి వచ్చి చూసేసరికి అతడు కనిపించకపోవడంతో చుట్టుపక్కల అంతా వెతికారు. సాయంత్రం పనులు ముగించుకొని తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూసేసరికి నీటి సంపులో శివ శవమై తెలియాడుతూ కనిపించాడు. ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని తిప్పర్తి పోలీసులు తెలిపారు.

భాగవతమే ప్రాణప్రదం..!

- ప్రాచీన కళలను కాపాడుతున్న తుర్కపల్లి కళాకారులు
- నేటికీ పలు జిల్లాల్లో యక్షగాన ప్రదర్శనలు
- ప్రభుత్వం ప్రోత్సహించాలని వేడుకోలు



యక్షగాన భాగవతం ఆడుతున్న కళాకారులు



భాగవత కళాకారులు

తుర్కపల్లి : ఎనకటికి పొద్దుగూకిందంటే చాలు పల్లెసీమల్లో వీధి భాగవతాలు, సింధునాటకాలు, ఒగ్గు, బుర్రకథలు, యక్షగానాలు ప్రజలను అలరించేవి. కానీ నేడు ఆ పల్లెల్లో స్టార్ టీవీ సకిలిస్తోంది. రాత్రి అయితే చాలు జనం సీరియల్స్ మోజులో పడిపోతున్నారు. దీంతో గ్రామాల్లో తరతరాల నుంచి వస్తున్న గ్రామీణ కళలు అంతరించి పోతున్నాయి. కానీ తుర్కపల్లి యక్షగాన భాగవత కళకారులు నేటికీ యక్షగాన ప్రదర్శనలిస్తూ ప్రాచీన కళరూపాన్ని కాపాడుతున్నారు. భాగవతమే తమకు ప్రాణప్రదమని అంటున్నారు.

200ఏళ్ల నుంచి యక్షగాన ప్రదర్శనలు

తుర్కపల్లి గ్రామంలో రెండు వందల సంవత్సరాల నుంచి వంశపారపర్యంగా యక్షగాన ప్రదర్శనలిస్తున్న కళకారుల కుటుంబాలు ఉన్నాయి. ఈ కళారూపాలు ప్రదర్శించే వీరికి ఎటువంటి లాభాం లేకున్న నేటికీ ఈ కళను ఆరాధిస్తూ అనేక ప్రదర్శనలిస్తున్నారు. వీరు ప్రదర్శించే యక్షగాన కళారూపాలు సీతాకల్యాణం, సుందరకాండ, ఎల్లమ్మ చరిత్ర, మల్లన్న చరిత్ర, మధన శేఖర్ విలాసం, బాల నాగమ్మ కథ, సుంభనిశుంభుల వధ, కీలుగుర్రం, గౌడపురణం, బ్రహ్మగారి చరిత్ర.

యువతరాన్ని ఆకర్షిస్తూ..

ఈ ప్రాంత కళకారులు నేటికి నల్లగొండ, సిద్దిపేట, మేడ్చల్, జనగామ జిల్లాలో ప్రదర్శనలిస్తున్నారు. చుట్టు ముట్టు గ్రామాల్లో ఏ ఉత్సవమైన వీరి భాగవత ప్రదర్శన నేటికీ కొనసాగుతుంది.పేరు ప్రఖ్యాతలు, ధనం కోసం కాకుండా కేవలం యక్షగానమే వీరికి ప్రాణపదంగా ఇష్టంగా ఈ కళారూపాన్ని ప్రదర్శిస్తున్నారు. తరాలు మారుతూ అంతరాలు ఏర్పడిన ఈ కళపై మక్కువ ఉన్నా యువతరానికి యక్షగాన రూపాలను నేర్పుతున్నారు. వారిని కూడా భాగస్వాములను చేసుకుంటూ కనుమరుగవుతున్న కళారూపానికి ప్రాణం పోస్తున్నారు.

ప్రభుత్వ ఆదరణ కరువైందంటున్న కళకారులు

తమ పూర్వీకుల నుంచి యక్షగాన కళారూపాలను ప్రదర్శిస్తున్న ఇప్పటి వరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా తమను ఆదుకునే వారు కరువయ్యారని ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఏ కళాకారునికి కూడా పెన్షన్ ఇవ్వడం లేదని వాపోతున్నారు. కనుమరుగవుతున్న కళను నమ్ముకున్న కళాకారులను తెలంగాణ ప్రభుత్వం అదుకుంటుందని ఎంతో ఆశపడినా నేటికీ ఎటువంటి ఫలితం దక్కలేదని ఈ కళాకారులంటున్నారు.

నిరుపేద కళాకారులను ఆదుకోవాలి



ఈ యక్షగాన కళరూపాన్ని నమ్ముకున్న కళకారులను ప్రభుత్వ గుర్తించాలి. నిరుపేద కళకారులను ఆదుకోవాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఈ కళను కాపాడుతుందని అనుకున్నాం. ప్రభుత్వం పట్టించుకోక పోవడం ఈ యక్షగాన కళరూపాలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది.

– బోయిని భిక్షపతి.తుర్కపల్లి

పాలకులు గుర్తించడం లేదు



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కనమరుగవుతున్న కళలకు ప్రాణం పోస్తారని ఎంతో ఆశపడ్డాం. కానీ యక్షగాన కళను నమ్ముకొని నేటికీ అనేక ప్రదర్శనలిస్తున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు గుర్తించలేదు.ఎంతో మంది నిరుపేద కళకారులకు ఇళ్లు కూడా లేవు. వృద్ధాప్యంలో ఉన్న కళకారులను పెన్షన్లు, జీవనభృతి కల్పించాలి. వడ్డీ లేని రుణాలు ఇప్పించి ప్రభుత్వం ఆదుకోవాలి.

– జి.వెంకటచారి, తుర్కపల్లి

భాగవత ప్రదర్శనలంటే ఇష్టం



చిన్ననాటి నుంచి భాగవత కళారూపాలను చూసి మా పెద్దల ప్రోత్సాహంతో ఈ కళను నేర్చుకున్నాం. నేటికీ మా గ్రామంలో 50 మంది కళకారులం వివిధ ప్రాంతాల్లో ఈ కళను ప్రదర్శిస్తున్నాం. నేటి తరానికి నచ్చేలాగా ప్రదర్శనల్లో మార్పులు చేసుకుంటు ముందుకు సాగుతున్నాం. కొత్తతరానికి కూడా ఈ యక్షగానా కళరూపాన్ని నేర్పుతున్నాం.

– మైసయ్య, తుర్కపల్లి

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ విజయవాడ హైవే @ రామోజీ ఫిల్మ్ సిటీ ప్రక్కనే హైవే ఫేసింగ్‌కు & ఇళ్ల మధ్య HMDA వెంచర్‌లో వెంటనే ఇళ్లు కట్టుకునే ప్లాట్లు, బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. ఫోన్: 9666607146 [HA-5747]

VILLAS FOR SALE

■ Ready to Occupy Duplex Luxury 3 BHK - 2340 sft Villas in the Best Gated Community at Miryalaguda. Next to new D.Mart, Club House Swimming Pool Fully Operational Must See Call: 08069045560 [H-804910]

Wanted

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ. 18k. ఫోన్: 9640468899 / 9640258899 [H-799856]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185002]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-13624]

■ నూతనంగా ప్రారంభించిన మా కంపెనీలో జాబ్స్ చేయుటకు 36 స్త్రీ/పుల కావలెను. జీతం: 14వేలు+ DA 6 వేలు+ఫ్రీరూం, భోజనం. Q: 7th-డిగ్రీ, ITI, డిప్లొమా (P/F). సెల్గొండ: 85198 91505. [L-822481]

Services

BUSINESS OFFER

■ ద్వారకాఎంటర్‌ప్రైజెస్‌పేపర్ ప్లేట్ & LED బిజినెస్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడిపదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [G-1454]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిం దిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

శాస్త్రీయ పద్ధతుల్లో పశుగ్రాసం సాగు భేష్

- తీరనున్న పశుగ్రాసం కొరత
- మెళకువలు పాటిస్తే అధికంగా పాల దిగుబడి



డాక్టర్ పిట్టల చంద్రబాబు, పశువైద్యాధికారి, పెద్దవూర

పెద్దవూర: పశుగ్రాసం అంటే రైతులకు గుర్తు వచ్చేది జొన్న, వరి, సజ్జ తదితర తృణధాన్యాలు. వీటిలో పశువులకు కావాల్సిన పోషకాలు లభించవు. పైగా వీటికి ఖర్చు అధికం. జీర్ణంకాని భాగం ఎక్కువే. శాస్త్రీయ పద్ధతిలో నాణ్యమైన పశుగ్రాసం అందిస్తే ఆరోగ్యంగా ఉంటాయి. అధిక పాల ఉత్పత్తి సాధించవచ్చు. పశుగ్రాసం సాగు ఖర్చు తగ్గించవచ్చు. డెయిరీ ఫారంల నిర్వహణ వ్యయంలో 70శాతం వరకు పశువుల మేతకే సరిపోతుంది. అందువల్ల మేత ఖర్చును తగ్గిస్తే అంతమేరకు లాభాలు పెంచుకునే అవకాశం ఉంది. అలాగే పాలశీతలీకరణ అధికారులు పాలు సప్లయ్ చేసే రైతులకు 50 శాతం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు అందిస్తారు. పశుసంవర్ధక అధికారులు సైతం 50శాతం రాయితీపై విత్తనాలు ఇవ్వనున్నారు. పశువుల కాపరులు వీటిని సద్వినియోగం చేసుకుని పశుగ్రాసం సాగు చేస్తే గడ్డి కొరత తీరుతుందని పెద్దవూర మండల పశువైద్యాధికారి డాక్టర్ పిట్టల చంద్రబాబు సూచించారు.



సాగులో ఉన్న పశుగ్రాసం

పాడి పంట

పశుగ్రాసం సాగు విధానం

- పశుగ్రాసం విత్తనాల్లో ప్రధానమైనవి సూపర్ నైపర్, కో1, కో 2, ఎస్ఎస్‌జీ–825 రకాలు.
- 85శాతం పచ్చిమేతను ఈ రకాల ద్వారా తీర్చుకోవచ్చు.
- ఒకసారి నాటితే 4 నుంచి 5 ఏళ్ల వరకు దిగుబడులు పొందవచ్చు.
- జనవరి నుంచి ఆగష్టు నెల వరకు విత్తనాలు విత్తుకోవచ్చు.
- అన్ని రకాల నేలల్లో సాగు చేసుకోవచ్చు. అమ్లగుణాలున గల నేలల్లో అధిక దిగుబడి ఉంటుంది.
- పశుగ్రాసాల సాగుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించలేని వారు తోటలు, కూరగాయ పంటల్లో అంతర పంటగా సాగు చేసుకోవచ్చు.
- ఎకరాకు 16 నుంచి 20 కిలోల విత్తనం అవసరం. మిశ్రమ పంటగా కూడా సాగు చేసుకోవచ్చు.
- దుక్కిలో 4 నుంచి 5 టన్నుల కంపోస్టు ఎరువు, 22 కిలోల యూరియా, 16 నుంచి 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి.
- విత్తిన 45 రోజుల తర్వాత ఎకరాకు 22 కిలోల యూరియా వేయాలి. ఎకరానికి 20 టన్నుల దిగుబడి వస్తుంది.
- అధిక విస్తీర్ణంలో సాగు చేసి సైలేజ్ లేదా ఎండి గడ్డి రూపంలో నిల్వ చేసి వాడుకోవచ్చు.

పాల దిగుబడి ఎక్కువే

పశుగ్రాసాల సాగుకు తక్కువ శ్రమ పెట్టుబడి అవసరం అవుతుంది. విత్తనాలు నాటిన కొద్ది రోజుల్లోనే పశుగ్రాసం కోతకు వస్తుంది. పచ్చిమేలు రుచికరంగా ఉండటం వలన పశువులు ఇష్టంగా తింటాయి. సులభంగా జీర్ణం చేసుకుంటాయి. పచ్చిమేత వలన పాల దిగుబడులు 25 శాతం వరకు పెరుగుతుంది. పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుంది. దాణా అవసరం లేకుండా కేవలం పచ్చిమేత ద్వారా 5 నుంచి 6 లీటర్ల పాల దిగుబడి సాధించవచ్చు. పచ్చి మేతలో కాల్షియం, భాస్వరం వంటి మాంసకృత్తులతో పాటు ఏ, డీ, ఈ విటమిన్లు, పిండి, కొవ్వు పదార్థాలు అధికంగా ఉంటాయి. నీరు తక్కువగా ఉన్న ప్రాంతాల్లోనూ పశుగ్రాసాలను సాగు చేసుకోవచ్చు.